క్లుప్తంగా

సరుకులు సర్దుబాటు చేస్తున్నాం

● సీడీపీఓ భారతి

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నింటికి జూలై నెలలో కందిపప్పు, బియ్యం, నూనె అందక పోవడంతో మిగులు ఉన్న కేంద్రాల నుంచి సర్దుబాటు చేసి అందించామని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ భారతి చెప్పారు. అంగన్‌వాడీలకు సరులకులు నిలిపేసిన విషయమై ×పేదలపై పగ× శీర్షికన ప్రచురించిన కథనానికి ఆమె స్పందించారు. పాలు, కోడి గుడ్లు, సంపూర్ణపోషణ కిట్లు, బాలామృతం అందిస్తున్నట్లు తెలిపారు. సర్దుబాటు గురించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



ఆర్థిక సహాయం అందచేస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: తీవ్ర జ్వరంతో పుల్లలచెరువు మండలంలోని తెల్లగట్ల గ్రామానికి చెందిన కందుల భారతి మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, చాపలమడుగు సర్పంచ్ తమ్మినేని సత్యనారాయణరెడ్డి, రోషిరెడ్డి ఉన్నారు.

వరద ప్రాంతాల్లో ఉచిత బైక్ రిపేరు చేసిన మెకానిక్‌లు



ఉచిత బైక్ రిపేరు క్యాంపు నిర్వహిస్తున్న త్రిపురాంతకం బైక్ మెకానిక్‌లు

త్రిపురాంతకం: విజయవాడ వరదల్లో నీటిలో మునిగి మరమ్మతులకు గురైన ద్విచక్ర వాహనాలను త్రిపురాంతకానికి చెందిన నవ్యాంధ్ర వాహన మిత్ర అసోసియేషన్ మెకానిక్‌లు ఉచితంగా క్యాంపు నిర్వహించి తమ వంతు బాధ్యతగా వాహనాలను రిపేర్ చేశారు. త్రిపురాంతకం నుంచి వెళ్లిన బైక్ మెకానిక్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత క్యాంపునకు మంచి స్పందన వచ్చినట్లు మెకానిక్‌లు తెలిపారు. తమ వంతుగా అక్కడే ఉండి సుమారు 450 వాహనాలను మరమ్మతులు చేసినట్లు చెప్పారు.

తాగునీటి లీకేజీని అరికట్టాలి



పైప్ లీకై నీరు వృథాగా పోతోందని చూపుతున్న వృద్ధుడు

కురిచేడు: స్థానిక నుసుం బజారులో రక్షిత తాగునీటి పైపులైను లీకై వృథాగా పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. నుసుం బజారులో వెంకటేశ్వరరెడ్డి నివాసం వద్ద ఎన్‌ఏపీ కుళాయి, బోరు ఒకేచోట వున్నాయి. వాటి నీరు కాలువలోకి వెళ్తున్నా దానికి పక్కన రోడ్డుపై పైపులైనుకు లీకు ఏర్పడి నెలలు గడుస్తోంది. ఎన్‌ఏపీ సిబ్బందికి ఆ ప్రాంత వాసులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఆ నీరు లీకై రోడ్డుపై పాచి పట్టడంతో వృద్ధులు అటుగా వెళ్తున్న సమయంలో జారిపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌ఏపీ అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేయించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కళాకారుడికి గుర్తింపు



కొండయ్యను సన్మానిస్తున్న సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు

కురిచేడు: మండలంలోని ఆవులమంద గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు దేవినేని కొండయ్యకు విజయవాడలోని బాలోత్సవ్ భవనంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు. ఆయన శ్రీలక్ష్మీతిరుపతమ్మ వేషధారణలో 208 నాటకాలు ప్రదర్శించినందుకు మెచ్చి జాతీయ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, న్యూఢిల్లీ వారు సన్మానించారు.

వృద్ధురాలికి నిత్యావసరాలు అందజేత

కొమరోలు: మండలంలోని అల్లినగరం గ్రామంలో పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ఓ వృద్ధురాలికి రక్ష వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రంగ జనార్దన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గణపతి నవరాత్రులు



ఇండ్లచెరువులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

త్రిపురాంతకం: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా భక్తులచే ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుని విగ్రహాల ఊరేగింపులు గ్రామాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. త్రిపురాంతకం మండలంలో గణపతి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండపాల వద్ద అన్నదానం చేశారు. త్రిపురాంతకం దగ్గులవారి వీధిలోని కోదండరామస్వామి ఆలయం వద్ద గణపతి, శ్రీవాసవి మాత ఆలయం వద్ద విగ్రహం, రాజుపాలెం, వెల్లంపల్లి, దూపాడు, విశ్వనాథపురం, గొల్లపల్లి గణపవరం గ్రామాల్లో విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. యువకులు కేరింతలు కొడుతూ ఊరేగింపులు చేశారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను విజయవాడ, శ్రీశైలం, అమరావతి, నాగార్జునసాగర్‌కు భక్తులు నిమజ్జనానికి తరలిస్తున్నారు.

పెద్దదోర్నాలలో..

మండల కేంద్రంలోని వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడితో పాటు రజకవీధి, అయ్యప్ప స్వామి గుడి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు ఆదివారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా కొన్ని విగ్రహాలు మండల పరిధిలోని గంటవానిపల్లె చెరువు, మరికొన్ని విగ్రహాలు శ్రీశైలం ప్రాజెక్టుకు నిర్వాహకులు నిమజ్జనం కోసం తరలించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం పట్టణంలో ఘనంగా నగరోత్సవం నిర్వహించారు.

ఉత్సాహంగా వినాయక నిమజ్జనం

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా సాగింది. వినాయకునికి నైవేద్యంగా పెట్టిన లడ్డూను వేలం వేయగా గుమ్మా వెంకటేశ్వర్లు రూ.36 వేలకు కైవసం చేసుకున్నారు.



గణనాథుడికి కొబ్బరికాయ కొడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

గణేశ్ నిమజ్జనంలో ఎమ్మెల్యే,జడ్పీచైర్మన్

దర్శి: స్థానిక కొత్తపాలెం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్‌బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని పూజలు చేశారు. తొలుత వారికి కొత్తపాలెం ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డిని స్థానిక యువత భుజాలపైకి ఎత్తుకుని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, కొత్తపాలెం నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గణపయ్యకు నీరాజనం

కురిచేడు: మండలంలోని వీవై కాలనీ వాసులు గణపతి నిమజ్జనాన్ని కోలాహలంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో సాగిన ఈ గ్రామోత్సవంలో కాలనీ లోని మహిళలు, యువకులు, చిన్నారులు నృత్యాలతో సందడి చేశారు.



పెద్దదోర్నాలలో నిమజ్జనానికి ముందు ప్రత్యేక పూజలు అందుకుంటున్న వినాయక నగర్ గణనాథుడు



నిమజ్జనానికి బయలుదేరిన గణనాథుడు



ఉత్సాహంగా నృత్యం చేస్తున్న కాలనీ వాసులు

ఘనంగా పువ్వాడమ్మ కొలుపులు



పువ్వాడమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, కుటుంబ సభ్యులు

● హాజరైన బూచేపల్లి కుటుంబ సభ్యులు

ముండ్లమూరు(దర్శి): మండలంలోని జమ్మలమడక గ్రామ సమీపంలో పువ్వాడ వద్ద కొలువై ఉన్న పువ్వాడమ్మ తల్లి కొలుపులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కాపా రమణారెడ్డి, నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షులు చింతా శ్రీనివాసరెడ్డి, మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, నాయకులు రత్నం, భిక్షాలురెడ్డి, గొంది వెంకటప్పారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరావు, ఎంపీటీసీ గుణపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు రాంబాబు, వెంకటరావు, వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాసరావు, వంగల శ్రీనివాసరెడ్డి, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

రామిరెడ్డి మృతదేహానికి బూచేపల్లి నివాళి

తాళ్లూరు(దర్శి): తాళ్లూరు మాజీ ఎంపీపీ కోటా రామిరెడ్డి మృతదేహానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదివారం నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రామిరెడ్డి మృతి చెందగా సమాచారం తెలుసుకున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రామిరెడ్డి మరణం వైఎస్సార్‌సీపీ కి తీరని లోటని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం రామిరెడ్డి మృతదేహాన్ని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, గోళ్లపాటి మోషే, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

అధ్వానంగా తెల్లబాడు–వెస్ట్ కంభంపాడు రహదారి



తెల్లబాడు-వెస్ట్ కంభంపాడు రోడ్డు దుస్థితి ఇదీ..

దొనకొండ: మండలంలోని తెల్లబాడు నుంచి వెస్ట్ కంభంపాడు రహదారి సుమారు 2 కిమీ మేర అధ్వానంగా తయారైంది. వర్షాలు కురవడం ఆగి వారం గడుస్తున్నా రోడ్లపై నీళ్లు అలాగనే ఉన్నాయి. దీంతో వాహన చోదకులు ద్విచక్ర, ఆటోవాలాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మరీ ముఖ్యంగా రెండు గ్రామాల ప్రజలు నిత్యం వ్యవసాయ పనులకు ట్రాక్టర్లలో వెళ్తుంటారు. ఆదమరిస్తే అంతే సంగతులన్నట్లు రహదారి పరిస్థితి తయారైంది. వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్లు రెండు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంటిగంగ ఆలయంలో భక్తుల పూజలు

తాళ్లూరు(దర్శి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం గుంటిగంగాభవాని అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. పూజా కార్యక్రమం సందర్భంగా ఆలయ పూజారులు విజయలక్ష్మి, కామేశ్వరరావు, ప్రకాశరావు, బాలరాజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈఓ కార్తీక్ ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రత్యేక పూజల్లో ఎస్సై మల్లికార్జునరావు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గుంటిగంగాభవానీ అమ్మవారు



పూజలు చేస్తున్న భక్తులు

అక్రమ మద్యం సీజ్



సీజ్ చేసిన మద్యంను చూపుతున్న ఎస్సై మురళి

దర్శి: స్థానిక లంకోజనపల్లి రోడ్‌లో మద్యం దుకాణం పక్కన ఉన్న పాన్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 24 మద్యం బాటిళ్లను ఎస్సై మురళి ఆదివారం సీజ్ చేశారు. ఎస్సై కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు అందించిన సమాచారంతో పాన్‌షాపును తనిఖీ చేయగా అందులో 7 బీర్లు, 17 క్వార్టర్ బాటిళ్లు లభించాయని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించారు. నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.



అలంకరణలో వేనూతల కాటమరాజుస్వామి

పలువురికి బూచేపల్లి పరామర్శ

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదివారం రాత్రి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పరామర్శించి ఓదార్చారు. గ్రామానికి చెందిన కర్నాటి భాస్కరరెడ్డి ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన వాతల వెంకటేశ్వరరెడ్డి జారిపడి గాయపడడంతో వారిద్దరినీ ఆదివారం బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ పరామర్శించి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం చేసి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొంది వెంకటప్పారెడ్డి, అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, రాఘవరెడ్డి, వాతల రామిరెడ్డి, జనమాల పిచ్చయ్య, వాతల శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.



గాయపడిన భాస్కరరెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బూచేపల్లి యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద తొమ్మిదో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమంలో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో ఏటా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది అంగరంగ వైభవంగా మూడు రోజుల నుండి విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి వినాయక చవితి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వినాయక చవితి వేడుకలలో భాగంగా ఆదివారం రాత్రి విగ్రహాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, వైస్ సర్పంచ్ బిజ్జం కృష్ణారెడ్డి, నాయకులు బాలకోటిరెడ్డి, కోటిలింగారెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, మదార్‌వలి, గర్నెపూడి ప్రసన్నకుమార్, కంభంపాటి నాగేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పసుపుగల్లులో పూజలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

ఆటో అదుపుతప్పి డ్రైవర్ మృతి

పెద్దారవీడు: రోడ్డుకు అడ్డంగా వెళ్తున్న గేదెను తప్పించబోయి ఆటో అదుపుతప్పడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో తోకపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మార్కాపురం పట్టణం పరిధిలో డ్రైవర్స్ కాలనీ నుంచి యర్రగొండపాలెం పట్టణానికి కూరగాయలు తీసుకురావడానికి డ్రైవర్ మంగమూరి బ్రహ్మయ్య బయలుదేరారు. తోకపల్లి గ్రామం సమీపంలోకి రాగానే జాతీయ రహదారికి అడ్డంగా పోతున్న గేదెను తప్పించబోయిన డ్రైవర్ అదుపుతప్పి ఆటో పొలంలోకి దూసుకువెళ్లింది. దీంతో ఆటోలో నుంచి కింద పడిన డ్రైవర్ బ్రహ్మయ్య (47)కు తలకు తీవ్రమైన గాయం తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.



సంఘటన స్థలంలో మృతుడు మంగమూరి బ్రహ్మయ్య

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

రాచర్ల: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తలకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై పి.కోటేశ్వరరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఆయన వెంట ఏఎస్సై ఆదిశేషయ్య ఉన్నారు.